WWW.DIGITAL.KERATAM.N
https://digital.keratam.in/
కెరటం
శనివారం, 12 నవంబర్ 2022 పేజీలు : 08

### జాతీయ లోక్ అదాలత్‌ను

# విజయవంతం చేయండి

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్**



**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

నేడు( నవంబర్ 12)న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన క్రిమినల్ కేసులు,మోటార్ వాహన ప్రమాద కేసులు , సివిల్ కేసులు , ప్రాంసరినోట్ కేసులు,మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు,కుటుంబ తగాదాల కేసులు,డివిసి, బ్యాంకు పిఎల్సి కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని సమయం డబ్బులు ఆదా అవుతాయని కక్షిదారులను కోరారు.

## మున్నూరు కాపుల జోలికొస్తే సహించేది లేదు

**మున్నూరు కాపు సంఘ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు బాపట్ల మురళి**



**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

మున్నూరు కాపు సంఘ నాయకుల ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా ప్రయత్నించే వారు ఎవరైనా సరే సహించేది లేదని మున్నూరు కాపు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు బాపట్ల మురళి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘ అపెక్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రివర్యులు గంగుల కమలాకర్, సంఘ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్రాలపై ఈడీ దాడులను తీవ్రంగా ఖండించారు. నిబద్ధ తతో, అవినీతికి తావు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తూ, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు అన్నారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, కరోనా కాలంలో వందలాది కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 లక్షలు పైగా ఉన్న మున్నూరు కాపులందరినీ ఒకే వేదిక పైకి తీసుకొచ్చి వారి అభ్యున్నతికి పాటుపడుతుండడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సామాజిక వర్గాలు ,బీసీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు .ప్రధాన నాయకుల పై దాడులు జరిగితే వెనుకంజు వేస్తారు అనుకోవడం పొరపాటని అన్నారు .తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపులందరూ సమైక్యంగా ముందుకు కదిలి తమ సత్తా నిరూపిస్తామని తెలిపారు.

### ఆరోగ్య కేంద్రం కాంట్రాక్టర్ అవినీతి, అక్రమాలపై జిల్లా

# ఉన్నతాధికారులు స్పందించాలి

- కార్మికుల వేతనాల ఎగవేసిన చర్యలు తీసుకొండి
- సమాన పనికి సమాన వేతనం చెల్లించకుంటే ఉద్యమిస్తాం
- ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య
- ఆస్పత్రి సూపరింటెడెంటుకు వినతిపత్రం అందించిన నేతల బృందం



**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

ఆరు నెలల కార్మికుల వేతనాలు చెల్లించ కుండా ఇబ్బందులకు గురిచేస్తున్న మతా శిశు ఆరోగ్యం కేంద్రం కాంట్రాక్టరుపై చర్యలు తీసుకో వాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటియుసి, సిపిఐ ప్రతినిధిబృందం శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ కొత్తగూ డెం పట్టణం రామవరం ప్రాంతంలో నూత నంగా ఏర్పాటైన మాతా శిశు ఆరోగ్యం కేంద్రంలో వర్కర్ల నియామకానికి టెండరు పొందిన కాంట్రాక్టరు తొమ్మిది నెలలు పనిచేయించి కేవలం మూడు నెలల వేతనం మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంన్నాడని అన్నారు. మూడు నెలల వేతనం కూడా నిబంధనల ప్రకారం చెల్లించ కుండా అరకొర వేతనాలు చెల్లించాడ న్నారు. కార్మికులు, సెక్యూరిటీ గార్డుల నియామకం కోసం ఒక్కోక్కరి నుంచి రూ. 70 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసి అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఎక్కువ మంది గిరిజన పేదలు ఈ సాయి సెక్యూరిటీస్ సంస్థ వల్ల ఆర్థికంగా నష్టపోయారన్నారు. టెండరుకు విరుద్ధంగా మూడోంతులు ఎక్కువగా నియా మకాలు చేపట్టి మోసం చేశాడన్నారు. జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు, నియామకాలకు వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇప్పించాలని అధికారిని కోరారు. తమ విజ్ఞప్తిపై సూపరిం టెండెంట్ సానుకూ లంగా స్పందిం చారని, కార్మికులకు న్యాయం చేసేందుకు సమగ్ర విచారణ చేపడతామని హామీ ఇచ్చినట్లు జమలయ్య తెలిపారు. వినతి పత్రం సమర్పిం చిన వారిలో సిపిఐ నాయకులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు వై.శ్రీనివాసరెడ్డి, భూక్య శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



### కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న

# మోడీ పర్యటను అడ్డుకుంటాం

- తెలంగాణను దివాలా తీయించే చర్యలకు పాల్పడుతున్న కేంద్రం
- పేద, కార్మిక, కర్షకుల నినాదమే 'మోడీ గో బ్యాక్'
- మోడీకి జిల్లా ప్రజల నిరసనల సెగ తగలాలి
- సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు ఎస్కె.సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య




**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

విభజన చట్టాన్ని తుంగలో తొక్కి తెలంగాణకు అన్యాయం చేయడంతోపాటు కార్పోరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్న ప్రధాన మోడీకి తెలంగాణ రాష్ట్రంలో పర్యటించే అర్హత లేదని, తక్షణమే తన పర్యటనను రద్దు చేసుకొని వెనక్కు వెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. నవంబర్ 12న మోడీ పర్యటను సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలపై చర్చించిన అనంతరం జరిగిన ఇరు పార్టీల సంయుక్త సమావేశంలో వారు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకోసం కాకుండా అదాని, అంబానీ లాంటి కుబేరులకు కోసం పనిచేస్తున్నాడని విమర్శించారు. విభజన చట్టంలోని బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట కోట్ ఫ్యాక్టరీ, గిరిజ విశ్వవిద్యాలయం ఏర్పాటు నిర్లక్ష్యం చేస్తూ తెలంగాణ పట్ల వివక్షత చూపుతున్నారన్నారు. ఒవైపు ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు దారాదత్తం చేస్తూ మరో పక్క రామగుండం ఎరువుల కర్మాగరాన్ని జాతికి అంకితం చేస్తున్నామని తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే కుట్రలు చేస్తున్నారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి లక్షలాది మంది ఉద్యోగులను, కార్మికులను రోడ్డుపాలు చేస్తున్నారని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న






చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎనిమిదేళ్ళ కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని బిజెపి ప్రభుత్వం చేసిందేమీలేదని, వివక్షతతో రాష్ట్రాన్ని దివాలా తీయించే చర్యలకు పూనుకుంటున్నారన్నారు. పేద ప్రజల, కార్మిక, కర్షకుల నినాదమే 'మోడీ గో బ్యాక్' అని అయన పర్యటనను అడ్డుకొని తీరతామన్నారు. అరెస్టులకు, నిర్భందాలకు పాల్పడితే రామగుండం రణరంగంగా మారుతుందని హెచ్చరించారు. మోడీకి జిల్లా ప్రజలు నిరసనల సెగ తగిలేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుత్తుల సత్యనారాయణ, సిపిఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, సిపిఎం, సిపిఐ నాయకులు లిక్కి బాలరాజు, జె.గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ పిడమర్తి రవితోనే సాధ్యం

- ఈనెల 29వ తేదీన చలో ఢిల్లీని జయప్రదం చేయండి
- మాదిగ యూత్ జేఏసీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్

**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**



మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు తెలంగాణ తొలి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత, మాదిగ యూత్ జేఏసీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు గద్దల రమేష్ తెలిపారు. ఈ మేరకు అయినా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తూ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 29 30 తేదీలలో మాదిగ జేఏసీ ప్రజాసంఘాల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్ పెంచాలని అన్నారు అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మాదిగలను బిజెపి మోసం చేసినా... కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని మెడల వంచి ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు



## నేడు ప్రధాని పర్యటనపై ఆందోళన కార్యక్రమాలు

- తెలంగాణలోని కార్మికుల సత్తా తెలియజేస్తాం
- ఏరియాలో ఉన్న అన్ని గనుల, ఓ.సి.ప్రాజెక్ట్, డిపార్ట్ మెంట్లలలో నిరసన గళం వినిపిస్తాం
- టీబీజీకేస్ కొత్తగూడం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్

**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

నేడు ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన అడ్డుకోవాలని ఆ దిశగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని అధినాయకత్వం ఇచ్చిన పిలుపులో భాగంగా ఏరియాలో ఉన్న అన్ని గనుల, ఓ.సి.ప్రాజెక్ట్, డిపార్ట్ మెంట్ల లలో కండువాలు ధరించి జెండాలు చేత పట్టుకొని కార్మిక వర్గం గో బ్యాక్ మోడీ గో బ్యాక్ మోడీ అనే నినాదంతో తెలంగాణలో అడుగు పెట్టవద్దని తెలంగాణలోని కార్మికుల సత్తా వారికి తెలియజేయాలని టీబీజీకేస్ కొత్తగూడం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ ప్రకటన భాగంగా తెలియజేశారు. కార్మిక సంఘాలకు కత్తెర వేసే విధంగా 44 కార్మిక చట్టాలను 4 లెబర్ కొడ్ లుగా చేసి కార్మిక హక్కులను హరించెల ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలు కార్మిక వర్గం తిప్పి కొట్టాలని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న సింగరేణి ని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని చూస్తుంటే నరేంద్ర మోదీ కార్పొరేట్ బడ బాబులకు దోచి పెట్టడం జరుగుతుంది, సింగరేణి పై వివక్షత చూపుతూ ప్రభుత్వ రంగ సంస్థలలను నిర్వీర్యం చేయాలనీ చూస్తున్నారని వేతన ఒప్పందాల్లో కూడా అనుకున్న మేర వేతనాలు పెరగకుండా మోదీ అడ్డుకుంటున్నారని ఆయన పర్యటన ను అడ్డుకునే దిశలో టిబిజికెయస్ కార్మిక వర్గం సిద్ధంగా ఉందని తెలిపారు.

### బిసి సంక్షేమ శాఖలో జరిగిన

# అవినీతిపై విచారణ జరిపించాలి

- దమ్మపేట బిసి హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం




**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

జిల్లా బిసి సంక్షేమ శాఖలో అవినీతి జరిగిందని, దీనిపై కలెక్టర్ నేతృత్వంలో విచారణ కమిటీ వేయాలనీ డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ),భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మంచికంటి భవన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం మాట్లాడుతూ బిసి సంక్షేమ శాఖలో టెండర్లు ఆహ్వానించకుండా కోడిగుడ్లు, చికెన్ చేతి కొనుగోలు చేస్తున్నారనీ తప్పుడు పద్ధతుల్లో బిల్స్ క్లెయిమ్ చేస్తున్నారనీ,చేతి కొనుగోళ్లలో అవినీతి జరిగిందని, హాస్టళ్లలో విద్యార్థులు లేకపోయినా తప్పుడు హాజరు చూపుతున్నారని అన్నారు. విద్యార్థులు లేకపోయినా, తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి స్కాలర్షిప్స్ పొందుతున్నారనీ అన్నారు. ఈ విద్యా సంవత్సరం శాఖా లెక్కల ప్రకారం విద్యార్థుల సంఖ్య ప్రీ మెట్రిక్,పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు మొత్తం కలిపి 1800 పైగా ఉన్నారనీ,కానీ ఎస్ఎఫ్ఐ జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించిన క్రమంలో విద్యార్థులు సంఖ్య కేవలం 900గా తేలిందని రెట్టింపు హాజరు చూపి వార్డెన్లు, డిడి మిలాఖత్ అయ్యి బిల్లులు,సోప్ మనీ,విద్యార్థుల నోట్ పుస్తకాలు, టవల్స్, బ్లాంకెట్స్ స్టేషనరీ దారి మళ్ళించారనీ అన్నారు. మెటీరియల్ స్టాక్ వివరాలు అడిగితే డిడి ఇవ్వడంలేదనీ, అవినీతి జరిగిందని స్పష్టమవుతోందనీ ఆయన అన్నారు. దీనంతటికీ జిల్లా సంక్షేమ అధికారి బాధ్యత వహించాలనీ, కలెక్టర్ తక్షణమే స్పందించి శాఖాపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. దమ్మపేట వార్డెన్ శ్రీనివాసరావు ను సస్పెండ్ చేయాలనీ, స్కాలర్షిప్స్ రెన్యూవల్స్‌కు సంతకాలు చేసిన దమ్మపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పాత్రపైనా విచారణ జరిపించాలని కోరారు.మెనూ పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తన కలంతో గడగడలాడించిన


# గొప్ప జర్నలిస్ట్ ఆజాద్

- భారతదేశంలో ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌ను స్థాపించడంలో ఆయన చేసిన కృషి మరువలేనిది
- దివ్య గ్రంథమైన ఖురాన్ కూడా విద్య ను ప్రోత్సహిస్తోంది ఆల్ జమాత్ జేఏసీ కొత్తగూడెం
- ఆల్ జమాత్ జేఏసీ ఆధ్వర్యంలో ఆజాద్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు పండ్లు పంపిణీ



శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)

నవంబర్ 1888 ఒక భారతీయ స్వాతంత్ర్య కార్యకర్త, ఇస్లామిక్ వేదాంతవేత్త, రచయిత, భారత జాతీయ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి- విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ జమాత్ జేఏసీ, తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుడిది గడ్డ ఏరియాలోని మదర్సా ఇస్లామీయ దరూల్ ఉలూమ్ లోని విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఆజాద్ భారత ప్రభుత్వంలో మొదటి విద్యా మంత్రి అయ్యాడని, మౌలానా అనే పదానికి గౌరవప్రదమైన అర్థం 'మా మాస్టర్' మరియు అతను ఆజాద్‌ను స్వీకరించాడు ( ఉచిత) అతని కలం పేరని, భారతదేశంలో మొట్ట మొదటి ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌ను స్థాపించడంలో ఆయన చేసిన కృషిని భారతదేశం అంతటా అతని పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు.



యువకుడిగా ఆజాద్ ఉర్దూలో కవిత్వం , అలాగే మతం, మత్వశాస్త్రంపై గ్రంథాలను రచించాడని, ఆజాద్ జర్నలిస్ట్‌గా పని చేయడం ద్వారా, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని విమర్శించే రచనలను ప్రచురించి, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలడించాడని, భారత జాతీయవాదానికి కారణాలను సమర్థించడం ద్వారా ప్రముఖంగా ఎదిగాడని కొనియాడారు .ఇస్లాం ప్రారంభం నుండి విద్యకు అధిక ప్రాధ్యాన్యత ఇచ్చిందని, జ్ఞానం ( 'ఇల్మ్) గురించిన 800 కంటే ఎక్కువ సూచనలు దివ్య ఖురాన్ లో కనిపిస్తాయని, విద్య యొక్క ప్రాధాన్యతను పదేపదే, గుర్తుచేస్తూ దివ్య ఖురాన్ లో "మీలో విశ్వసించిన వారికి, జ్ఞానం ప్రసాదింప బడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు.(58:11) మరియు ఓ ప్రభు! నాకు మరింత జ్ఞానం ప్రసాదించు."(20:114) మొదలగు ఆయతులు ఇస్లామిక్ సమాజం లో జ్ఞానం మరియు పఠనం కు ఉన్న ప్రాధాన్యతను తెలియస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ జమాత్ జేఏసీ సభ్యులు అబ్దుల్ ముఖిత్ జావిద్ అహెల్ హాథిస్ మరియు ఇస్మాయిల్ ఖాన్ , జమతే ఇస్లామి హింద్ సభ్యులు అక్బరీ ,ఇంతియాజ్, ఫహీం, కరీం మౌలానా ,ఆయుబ్ తబ్లిగ్ జమాత్ ,తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖలీల్ విద్యార్థులు పాల్గొన్నారు.



### విద్యార్థులు విలువలతో కూడిన

## విద్యా విధానాన్ని అలవర్చుకోవాలి

**కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి**

శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)

విద్యార్థులు విలువలతో కూడిన విద్యా విధానాన్ని అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని న్యాయమూర్తి తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ,కొత్తగూడెం ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగ న్యాయమూర్తి మాట్లాడుతు ప్రతి సంవత్సరం నవంబర్ 11 న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవం ను జరుపుకుంటారని విద్యాభివృద్ధికి విశేశ కృషి చేసిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగ ఈ దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. చదువు విలువ గురించి తెలియజేయ డానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారని తద్వారా ప్రజలకు విద్య ఆవశ్యకత గురించి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. దేశంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి 2009 జూలై రెండవ తేదీన విద్యా హక్కు చట్టంను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులకు ఉచిత నిర్బంధ విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త గూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రాంప్రసాదరావు, కోశాధికారి ఎండి సాధిక్ పాషా, సీనియర్ న్యాయవాదులు లక్కినేని సత్యనా రాయణ, రమేష్ కుమార్ మక్కడ్, లీగల్ సర్వీసెస్ సభ్యుడు మెండు రాజమల్లు, పసుపులేటి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేష్, కళాశాల అధ్యాప కులు వై.రమేష్, శంకర్, వెంకటేశ్వరరావు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి స్థలాలను రక్షించుకునేందుకు ఉద్యమిస్తాం

## సింగరేణి భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు బండి రాజుగౌడ్



శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)

సింగరేణి లీజుకిచ్చిన భూములలో అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న, భవంతులు కట్టి కిరాయికి ఇచ్చి సొమ్ము చేసుకుంటున్న ఇంటి యజమానులపై చర్యలు తీసుకోవాలని సింగరేణి భూపరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బండి రాజుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రామవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ప్రజలకు సేవ చేసేందుకు, మౌళిక వసతులను కల్పించే గతంలో కొంతమందికి స్థలాలను లీకు ఇచ్చింది. కాలక్రమేణ ఆ స్థలాలను సింగరేణి స్థలాలను ప్రభుత్వానికి అప్పగించింది. ఆ తదనంతరం కొంతమంది ఎక్కువ మొత్తం విస్తీర్ణాన్ని ఆక్రమించిన బడాబాబులు వాటిని సొంత స్థలాలుగా పరిగణించుకొని యాజమాన్య హక్కులు పొందుతున్నారు. వారికి ఇంత పెద్దమొత్తం విస్తీర్ణాన్ని ఏ విధంగా కేటాయించి, అధికారులు వాటిని క్రమబద్దీకరించారో చెప్పాలని ప్రశ్నించారు. సింగరేణి కార్మికుడు తన జీవితాన్నంత సంస్థ కోసం ధారపోసి తనకు కేటాయించిన క్వార్టర్ పక్కన స్థలంలో రూం నిర్మించుకుంటేనే ఆగమేఘాల మీద అధికారులు వచ్చి నిర్ధాక్షిణంగా రూంను కూలగొట్టి హెచ్చరించి మరీ వెళున్నారు. ఈ ఇళ్ళులు కూలగొట్టడం మూలాన ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అదే బడాబాబులు మాత్రం లీజుకు తీసుకున్న భూములను క్రమబద్దీకరించుకున్నా పట్టించుకున్న పాపానపోవడం లేదు. సింగరేణి, మున్సిపల్, రెవిన్యూ అధికారులు ఏకమై ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నారు. ఇప్పటికైనా సింగరేణికి సంబంధించిన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వారిపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ఈ అంశంపై ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, సింగరేణి సీ అండ్ డీని కలిసి ఫిర్యాదు చేస్తాం. ఈ సమావేశంలో సింగరేణి భూపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి, స్థలాలను రక్షించుకుంటాం. ఈ సమావేశంలో ఎస్‌కే.హుస్సేన్, ఎస్‌కే. ఇమ్రాన్, రామిల్లి మధుబాబు, లావుడి శ్రీనివాస్, కె.శ్రీనివాస్, అంతడుపుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలంలో భూ దందా..?

- ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న భూమిని సైతం కబ్జా
- ఇరవై సంవత్సరాలు ఇంటిలో రెంట్ ఉన్నవారే ఓనర్ భూమిపై కన్ను
- స్థలం మాదే అని బాధిత మహిళల ఆరోపణ
- తగిన న్యాయం చేయాలని వేడుకోలు



**భద్రాచలం, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

భద్రాచలం పట్టణ పరిధిలోని రెవెన్యూ కాలనీలో అక్రమంగా తమ భూమిని ఆక్రమించి కబ్జాలకు పాల్పడుతున్నారని పలువురి మహిళలు ఆరోపిస్తున్నారు. ఇరవై సంవత్సరాలు తమ ఇంట్లో కిరాయికి ఉండి నేడు తమ భూమినే ఆక్రమిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి బాధిత మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణానికి చెందిన చుంచు కృష్ణయ్య(లేట్) 1980లో రెండున్నర ఎకరాల భూమిని విల్ డిడ్ చేపించుకున్నారు. కృష్ణయ్యకి ఇద్దరు కుమార్తెలు, ధనలక్ష్మి, రత్నకుమారి, ఒక కుమారుడు ఉన్నారు. తల్లి, కుమారుడు కొద్దీ సంవత్సరాల క్రితం మృతి చెందగా అల్లుడూ అనారోగ్యంతో ఆరు నెలల క్రితం మృతి చెందారు. దిక్కు లేని పరిస్థితిలో ఇద్దరు కుమార్తెలు మిగిలారు. ఇదే అదునుగా చూసిన దళారులు వారి భూమిపై కన్నేసి అధికార యంత్రంగాన్ని, పోలీసుల అండతో జరుగుతున్న అక్రమాలను సైతం బయటకు రానివ్వకుండా అంగ బలంతో అర్ధ బలంతో శాశిస్తూ తన గుప్పెట్లో పెట్టుకొని కబ్జాలకు తెగపడుతున్నాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధ్యతాయుత ˊమైన విధుల్లో ఉన్న ఓ వ్యక్తి తన అనుచరరులతో కలిసి ఏ దిక్కు అందుబాటులో లేని ఆ మహిళల రెండున్నర ఎకరాల భూమిలో రెండు వందల ఎనభై ఎనిమిది గజాల భూమిని ఆక్రమించి ఆ స్థలంలో ఇల్లు కట్టడం మొదలుపెట్టారని వాపోయారు. ఈ విషయం తెలిసి ఆ మహిళలు అక్రమముగా వారి స్థలంలో కడుతున్న దగ్గరికి వెళ్లి ఎవరు మీరు ఎందుకు తమ స్థలంలో అక్రమంగా కట్టడం ఏంటి అని సదరు వ్యక్తిని నిలదీయగా, అతను ఒక ముప్పై మందిని తన అనుచరులను పెట్టుకొని, మహిళలపై దౌర్జన్యం కూడా చేపించడం జరిగిందని తెలిపారు. ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితిలో పోలీసులను, రెవెన్యూ అధికారులను కలిసినా తమకు ఏమి ఉపయోగం లేకపోయిందని పేర్కొన్నారు. ఆ భమిపై ఇంజక్షన్ ఆర్డర్, భూమి పేపర్లు అన్ని కూడా తమ దగ్గర పకడ్బందీగా ఉన్నాయని, అవి అన్ని చూపించినా అధికారులలో స్పందన లేదన్నారు. పంచాయితీ ఇవో కూడా ఏమి చూసి కరెంట్ మీటర్ ఇచ్చాడో అర్థం కాని పరిస్థితి ఉందని, అధికారులతో పరిచయాలు, డబ్బు ఉంటే ఏమైనా చేయవచ్చు అనేది కనపడుతుందని, అధికారులు తక్షణమే స్పందించాలని తెలిపారు అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని ఆపాలని, తమ బాధిత దగ్గర భూమికి సంబంధించిన అన్ని పేపర్లు ఉన్నాయని, అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు.



## నేడు గూడెం రానున్న డా.గడల

### రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటన

**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**



నేటి నుంచి రెండు రోజులపాటు డాక్టర్ జీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు కొత్తగూడెం నియోజకవర్గంలో పర్యటించనున్నట్టు డాక్టర్ జీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ జీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాస రావు శని ఆదివారాల్లో కొత్తగూడెం నియోజ టకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణంలోని శ్రీనగర్ 3వ, 4వ లైన్‌లో ఉన్న ఉన్న జనహిత ప్రాంగణంలో డాక్టర్ జీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన 250 మంది టిబి రోగులకు ఉచిత న్యూట్రిషన్ పుడ్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపిఎస్‌తో కలిసి గడల శ్రీనివాసరావు పాల్గొంటారు. కొత్తగూడెం పాల్వంచ పట్టణాల్లో డాక్టర్ జీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యవసర ఆధునిక వైద్య చికిత్సలు పొంది కోలుకుంటున్న వారి ఇళ్లకు వెళ్లి తాజా ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటారని పేర్కొన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో వేలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రూపొందించిన జాబ్ మేళా ఏర్పాట్లపై నిర్వహించే సమావేశంలో డాక్టర్ గడల ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కొత్తగూడెం, ఇల్లందు, ఖమ్మం, కల్లూరు పట్టణాల్లో జరిగే కార్తీక వనభోజనాలు కార్యక్రమాల్లో అతిథిగా హాజరవుతారని డాక్టర్ జీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు తెలిపారు.



## ముగిసిన కంపెనీ స్థాయి 'హాకీ' పోటీలు

**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో డబల్యూపిఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో శుక్రవారం గౌతంపూర్ ప్రొ.జయశంకర్ గ్రౌండ్ నందు కంపెనీ స్థాయి "హాకీ" పోటీలు ఘనంగా జరిగాయి. బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా ఎస్.ఓ. టు జి.ఎం. ఆర్. నారాయణ రావు హాజరయ్యారు. ముందుగా "హాకీ" సెమీ ఫైనల్పోటీలో శ్రీరాంపుర్‌కి బెల్లంపల్లి, మందమర్రి మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీరాంపుర్ విజేతగా, రెండవ మ్యాచ్ కేజీఎం, కార్పొరేట్ కి ఇల్లందు, మణుగూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో కేజీఎం, కార్పొరేట్ విజేతగా నిలిచింది. తరువాత "హాకీ" ఫైనల్పోటీలో శ్రీరాంపుర్‌కి కేజీఎం, కార్పొరేట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో కేజీఎం, కార్పొరేట్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా ఎస్.ఓ. టు జి.ఎం. ఆర్. నారాయణ రావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ కంపెనీ స్థాయి "హాకీ" ఫైనల్పోటీలో విజేతగా నిలిచిన కేజీఎం, కార్పొరేట్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడాకారులకు కంపెనీ అన్ని విధాలుగా సహకరిస్తుందని వారు నైపుణ్యంతో క్రీడలలో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ పోటీలలో ఏ ఒక్క టీం, వ్యక్తులు కాదు, గేమ్ మాత్రమే విజేతగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఎస్.ఓ. టు జి.ఎం. ఆర్. నారాయణ రావుతో, సిఎంఓఏఐ ప్రెసిడెంట్ పాలడుగు శ్రీనివాస్, ఎస్ఆర్ పర్సనల్ ఆఫీసర్ ఎం.మురళీ, డబల్యూపిఎస్ అండ్ జిఏ హనరరీ సెక్రటరీ వి.అజయ్, స్పోర్ట్స్ సుపర్వైజర్ సుందర్ రాజు, అసిస్టెంట్ స్పోర్ట్స్ సుపర్వైజర్ ఎం.సి.పాస్ నెట్, స్పోర్ట్స్ కో-ఆర్డినటర్ జి.రాజశేకర్, జనరల్ కాప్టెన్ కే.శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రేమ్ కుమార్, అశోక్, వెంకటేశ్వర్లు, మహేశ్, ఈశ్వర్ ఆర్గనైసర్లు, కొత్తగూడెం ఏరియా క్రీడాకారులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమమే కెసిఆర్ ధ్యేయం..

**కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు**

**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా కెసిఆర్ పరిపాలన సాగిస్తున్నారని కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శుక్రవారం పాల్వంచ పట్టణం పరిధిలోని బొల్లారిగూడెంలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, నవభారత్ లోని తె. మై. రె. జూనియర్ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనమా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మైనారిటీల అభివృద్ధి కోసం వేలాది కోట్ల రూ:లు వెచ్చిస్తూ పరిపాలన చేస్తున్నారన్నారు. మైనారిటీ గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని రేపటి భవితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మైనారిటీ జిల్లా అధికారి సంజీవరావు, జిల్లా మైనారిటీ కాలేజీ అధికారిని సులోచన, ప్రిన్సిపాల్ లు నబీబ్బి, ఎం యాదగిరి, జమీమాజాన్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, ఉర్దూగర్ చైర్మన్ ఎస్.కె అన్వర్ పాషా, కోఆర్డినేటర్ యాకూబ్ పాషా, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు మల్లెల శ్రీరామ్మూర్తి, పూసల విశ్వనాథం, ఎస్టీ సెల్ నాయకులు భూక్య విరన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





# గురుకులాల్లో పిల్లల రక్షణకు

# మా వంతు సహకారం

- అశ్వారావుపేట మైనారిటీ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు దిశగా అడుగులు
- ఉపాధ్యాయులు విద్యతో పాటు ధైర్యసహసలను సైతం బోధించాలి
- దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ పౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ భారతి
- అశ్వారావుపేటలో ఘనంగా తెలంగాణ వెల్ఫేర్ డేగా వేడుకలు
- మౌలానా అబుల్ కాలం ఆజాద్ జయంతి సందర్భంగా నివాళి

**శామ్, నవంబర్11(కెరటం ప్రతినిధి)**

గురుకులాల్లో పిల్లల రక్షణకు తమ వంతు సహకారం ఉంటుందని, అశ్వారావుపేట మైనారిటీ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు దిశగా అడుగులు వేసేందుకు ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని, ఉపాధ్యాయులు విద్యాతో పాటు ధైర్యసహసలను సైతం బోధించాలని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ పౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ భారతి అన్నారు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అశ్వారావుపేట పట్టణంలో గల ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో భారత దేశ మొట్టమొదటి ఎడ్యూకేషన్ మినిస్టర్ మౌలానా అబుల్ కాలం ఆజాద్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఆయన జయంతిని పురస్కరించుకొని తెలంగాణ వెల్ఫేర్ డేగా వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అతిదులుగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ పౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ భారతి, అశ్వారావుపేట మండల అధ్యక్షురాలు యం.డి రెహానా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి



సమాజంలో ఆడపిల్లలపై అనేక రకమైన దురదృష్టకరమైన సంఘటనలు జరుగుతున్నా యని, వాటిని తుది ముట్టించడానికి ఉపాధ్యాయులు విద్యా బోధనతో పాటు



వారికి ధైర్య సాహసాలను సైతం బోధించాలని అన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా బాలికలకు వసతులు కల్పిస్తున్నా ఆడబిడ్డలకు రక్షణ కరువైందని, వారి సంరక్షణకు సరైన ప్రొటక్షన్ ఇవ్వాలని తెలియజేసారు. జిల్లాలో వున్న గురుకులాలలో అశ్వారావుపేట మైనారిటీ పాఠశాలకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు దిశగా అడుగులు వేస్తున్న ఉపాధ్యాయ బృందనికి ముఖ్యంగా ప్రిన్సిపాల్ సంగీతకు ప్రత్యేక కృత్ఙతలు తెలియజేసారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఆజాద్ భారత ప్రభుత్వంలో మొదటి విద్యా మంత్రి అయ్యాడని, మౌలానా అనే పదానికి గౌరవప్రదమైన అర్థం 'మా మాస్టర్' మరియు అతను ఆజాద్‌ను స్వీకరించాడు (ఉచిత) అతని కలం పేరని, భారతదేశంలో మొట్ట మొదటి ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌ను స్థాపించడంలో ఆయన చేసిన కృషిని భారతదేశం అంతటా అతని పుట్టిన రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. యువకుడిగా ఆజాద్ ఉర్దూలో కవిత్వం, అలాగే మతం, మత్వశాస్త్రంపై గ్రంథాలను రచించాడని, ఆజాద్ జర్నలిస్ట్‌గా పని చేయడం ద్వారా, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని విమర్శించే రచనలను ప్రచురించి, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలడించాడని, భారత జాతీయవాదానికి కారణాలను సమర్థించడం ద్వారా ప్రముఖంగా ఎదిగాడని కొనియాడారు. అనంతరం ప్రిన్సిపాల్ సంగీత ఆధ్వర్యంలో పిల్లల అట పాటలతో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామూర్తి, ఎంపీటీసీ భారతి, సర్పంచ్ రమ్య, కో ఆప్షన్ సభ్యులు పాషా, యం.డి రెహానా బేగం, నంద్రు జయబారతి, యస్.కె ఆసిప్, షేక్ ముబారక్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.









ఖమ్మం పార్లమెంటు సభ్యులు, టీఆర్ఎస్ లోక్ సభ పక్ష నేత నామ నాగేశ్వరరావు పొలిటికల్ జర్నీపై కెరటం న్యూస్ రాసిన ప్రత్యేక సంచికను ఎంపీ నామ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కెరటం మీడియా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధులు వనం నాగయ్య, జెల్ది శ్యామ్, రైతు బంధు సమితి ఖమ్మం జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వర రావు, కొత్తగూడెం జడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండి.రసుల్, నామ సేవా సముతి సభ్యులు చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్, వైరా టీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం, నవంబర్11(కెరటం ప్రతినిధి)